సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

మంగళవారం, ఏప్రిల్ 16, 2024

డిజిటల్



## కవితకు కోర్టు వార్నింగ్

- మరోసారి ఇలా చేయొద్దని హెచ్చరించినా వినిపించుకోని ఎమ్మెల్సీ
- కోర్టు హాల్ నుంచి బయటికొస్తూ మరోసారి మీడియాతో మాట్లాడిన కవిత
- ఈ నెల 23 వరకు జ్యుడీషియల్ కస్టడీని విధించిన రౌస్ ఎవెన్యూ కోర్టు

ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాం కేసులో జైలుపాలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు కోర్టు సోమవారం వార్నింగ్ ఇచ్చింది. కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జర్నలిస్టులు ప్రశ్నలు అడిగితే బదులు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. మరోసారి ఇలా చేయొద్దంటూ రౌస్ ఎవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా హెచ్చరించారు. అనంతరం జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కోర్టు నుంచి కవితను అధికారులు తీహార్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా కవిత మళ్లీ మీడియాతో మాట్లాడారు. న్యాయమూర్తి హెచ్చరికలను పెడచెవిన పెట్టి మీడియాతో మాట్లాడారు. ఇది సీబీఐ కస్టడీ కాదని, బీజేపీ కస్టడీ అని వ్యాఖ్యానించారు. 'ఇది సీబీఐ కస్టడీ కాదు.. బీజేపీ కస్టడీ. రెండు నెలల నుంచి అడిగిందే అడుగుతున్నారు. బయట బీజేపీ అడిగిందే.. లోపల సీబీఐ అడుగుతోంది. ఇందులో కొత్తది ఏమీ లేదు' అని కవిత ఆరోపించారు. మధ్యంతర బెయిల్ కోసం కవిత పెట్టుకున్న పిటిషన్ ను కోర్టు ఇప్పటికే తోసిపుచ్చింది. రెగ్యులర్ బెయిల్ పై దాఖలు చేసిన పిటిషన్ ను కోర్టు ఈ నెల 16న విచారించనుంది.

- తెలంగాణ ప్రభ (న్యూ ఢిల్లీ)

# మీడియాతో మాట్లాడడమేంటి?

- కాళేశ్వరంలో రూ. 50 వేల కోట్ల అవినీతి జరిగిందన్న కేఏ పాల్
- సీబీఐ విచారణ కోసం హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు రేవంత్ లేఖ రాయాలని డిమాండ్
- అవినీతి బయటకు వచ్చేంత వరకు పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య



తెలంగాణ ప్రభ (హైదరాబాద్) : ఇండియాలోనే అతి పెద్ద స్కామ్ కాళేశ్వరం ప్రాజెక్ట్ అని.. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సీబీఐకి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఫిర్యాదు చేశారు. కోఠిలోని సీబీఐ కార్యాలయంలో డీజీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. 50 వేల కోట్ల అవినీతి జరిగిందని సీబీఐకి ఫిర్యాదు చేశామని చెప్పారు. తెలంగాణ హైకోర్టులో దీనికి సంబంధించిన నివేదిక ఉందని... అయినప్పటికీ సీబీఐ విచారణకు ఆదేశించలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో కాళేశ్వంలో జరిగిన అవినీతి గురించి ప్రశ్నించిన సీఎం రేవంత్... ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ హైకోర్టు చీఫ్ జస్టిస్ కు రేవంత్ లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో అవినీతి బయటకు వచ్చేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సీబీఐకి ఫిర్యాదు

3 లో..

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



# ధాన్యానికి మద్దతు ధర పొందాలి



## సునీతామహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్న శివారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్షేమ సంఘాల ,కుల సంఘాల ఆత్మీయుల సమ్మేళన సమావేశంలో పాల్గొన్న ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామానికి చెందిన కుంభాల మహేందర్ రెడ్డి దుబాయిలో నివసిస్తుండగా తన భార్య సుచిత్ర ఆమె కుమారుడికి వీసా పంపి దుబాయ్ కి తీసుకువెళ్లారు. వేసవికాలం సెలవులు ఉండడంతో విసిటింగ్ లో వెళ్లినట్లు తెలిసింది. తమ ఇంటికి తాళం ఉండడంతో గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్థరాత్రి తమ ఇంటి ఆవరణలో ఉన్న స్కూటీ, పదివేల నగదు, ఒక్క సెల్ ఫోన్ ఎత్తుకెళ్లినట్లు సమాచారం. జరిగిన ఘటన పట్ల బాధితుడు సెల్ ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయానికి ప్రతి రోజు పని రీత్యా వచ్చి పోయే ప్రజల దాహార్తిని తీర్చేందుకు కీర్తి శేషులు ఒగ్గు కథ కళాకారులు ఒగ్గు మల్లయ్య యాదవ్ జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు ఒగ్గు శ్రీనిధి సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహాసిల్దార్ రామచంద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్ రెడ్డి దూస శ్రీనివాస్ , మాజీ ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్. మల్లేశం యాదవ్ రమేష్ యాదవ్ , తదితరులు పాల్గొని శ్రీనిధిని అభినందించారు.

## ఆదిరెడ్డికి జాతీయస్థాయి అవార్డు

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని సండ్రాల్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి జాతీయ బాబు జగ్జీవన్ రామ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షులు దాసరి స్వప్న, మహేష్ లు సోమవారం ఆన్ లైన్‌లో ఏనుగు ఆదిరెడ్డి కి అవార్డు తో కూడిన ప్రసంసా పత్రాన్ని అందజేశారు. పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయుల పుట్టిన రోజు వేడుకలు జరుపడం, అలాగే సమాజ సేవ చే యడం, తదితర అంశాలపై ఆదిరెడ్డి కృషి చేసినందుకు దేశ నాలుగవ డిప్యూటీ ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ పేరు మీద, జాతీయ బాబు జగ్జీవన్ రామ్ ఎక్సలెన్స్ అవార్డ్ వారికి పంపినట్లు దాసరి స్వప్న, మహేష్ తెలిపారు. అవార్డ్ అందుకున్న ఆదిరెడ్డిని ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు.

# విచారణకు సహకరించలేదు

- తప్పుదోవ పట్టించేలా కవిత సమాధానాలు చెప్పారు: సీబీఐ
- కస్టడీకి సంబంధించి 11 పేజీలతో రిమాండ్ అప్లికేషన్ దాఖలు చేసిన సీబీఐ
- శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ.14 కోట్ల వ్యవహారంపై కవితను ప్రశ్నించినట్లు వెల్లడి
- దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయగలిన, పలుకుబడి గల వ్యక్తి కవిత అని పేర్కొన్న సీబీఐ
- కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేసే అవకాశం ఉందన్న సీబీఐ

**తెలంగాణ ప్రభ (న్యూ ఢిల్లీ) :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తమకు కస్టడీలో సహకరించలేదని, ఉద్దేశ్యపూర్వకంగా తప్పుదోవ పట్టించేలా సమాధానాలు చెప్పారని సీబీఐ పేర్కొంది. మూడు రోజుల పాటు తమ కస్టడీ లోకి తీసుకొని విచారించిన సీబీఐ అధికారులు సోమవారం ఆమెను రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో ప్రవేశ పెట్టారు. 11 పేజీలతో రిమాండ్ అప్లికేషన్‌ను దాఖలు చేశారు. ఇందులో కీలక అంశాలను వెల్లడించారు. శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ. 14 కోట్ల వ్యవహారంపై కవితను ప్రశ్నించినట్లు అందులో పేర్కొన్నారు శరత్ చంద్రారెడ్డి, గోరంట్ల బుచ్చిబాబు, విజయ్ నాయర్‌తో జరిగిన సమావేశాలపై కస్టడీ సందర్భంగా ప్రశ్నించామని, వాటికి కవిత సూటిగా సమాధానాలు చెప్పలేదన్నారు. ఆమె దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయగలిన, పలుకుబడి గల వ్యక్తి అని అందులో పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేసే అవకాశం ఉందన్నారు. డిజిటల్ పరికరాలు, డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉందని, ఈ పరిస్థితుల్లో ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరింది. కోర్టు ఆమెకు 9 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించింది.



## మున్నూరు కాపుల దినోత్సవంగా శ్రీరామనవమి

**రాష్ట్ర సెక్రటరీ జనరల్ హరి అశోక్ కుమార్.**

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** శ్రీరామ నవమి పండుగను మున్నూరు కాపుల దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం సెక్రెటరీ జనరల్ హరి అశోక్ కుమార్, మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరే దశరథం లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పటేండ్లవాడలో సోమవారం హరి నర్సయ్య పటేల్,పుప్పాల నారాయణ పటెండ్ల స్మారక భవన్ సమావేశ మందిరంలో వారు మున్నూరు కాపుల శుభ దినోత్సవం పౌరాణిక,చారిత్రక విశేషాలను సంఘాల ప్రతినిధులకు వివరించారు. సంఘము తరపున మున్నూరు కాపులను బీసీ – ఏ



గ్రూప్ లో చేర్చాలని బి సి.కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు కు తగు కారణాలతో వినతి పత్రం సమర్పించామన్నారు. మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,కృషి చేసిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం భద్రాచలం లో జరిగే సీతారాముల కళ్యాణముకు తమ రాష్ట్ర సంఘము తరపున స్వామి వారికి ముత్యాల తలంబ్రాలను,పట్టు వస్త్రాలను సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరే మహేందర్,మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గంగాధర్,యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి విజయ్,ప్రధాన కార్యదర్శి క్యాస రఘునందన్ రెడ్డి,లీగల్ సెల్ అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుప్పాల నర్సింగరావు, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు పుప్పాల విజయ, ప్రధాన కార్యదర్శి గంగం జలజ,జిల్లా నాయకులు తాడెపు రమణ పుప్పాల కిషోర్ కుమార్,రాపల్లి గంగన్న, లైసెట్టి వెంకటి,కొండెంగారి శ్రీధర్, పి.సి.హన్మంత్ రెడ్డి, వొజ్జలబుచ్చిరెడ్డి, సౌదాల కమలాకర్ , భూతం ఆనంద్ వొద్దుల జగన్, నెల్ల రాజేశ్వర్ రెడ్డి, చిందం మనోహర్ పటేల్ , మారిశెట్టి అశోక్, దిండిగాల విట్టల్, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు

తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) : సిరిసిల్ల పద్మశాలి సంఘం భవన నిర్మాణం కోసం స్పందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పద్మశాలి సంఘంనాయకులతో కలిసి పొన్నం ప్రభాకర్ ను కలిశారు. పద్మశాలి భవన నిర్మాణం కోసం చేయూత ఇవ్వాలని కోరగా పూర్తి సహకారం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు గోలి వెంకటరమణ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గూడూరి ప్రవీణ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల బాలయ్య, పట్టణ అధ్యక్షులు గోలి వెంకటరమణ, బొల్లి రామ్మోహన్, సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, దార్ణం లక్ష్మీ నారాయణ, గోవిందు రవి, మండల సత్యం, డాక్టర్ బాలయ్య, తదితరులు ఉన్నారు.





## ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డి పేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం కన్నుల పండుగగా జరిగాయి. సోమవారం ఉదయం గరుడసేవ స్థాపిత పూజ మూల మంత్ర హవనం నవగ్రహ హవనం భలిహరణం పూర్ణాహుతి సాయంత్రం రథోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బుగ్గ వాసు శర్మ ఆధ్వర్యంలో బుగ్గ కృష్ణమూర్తి శర్మ , బుగ్గ శ్రీ నివాస్ శర్మ, బి నరహరి శర్మ , బి ఆంజనేయ శర్మ, బి శ్రీనివాస్ శర్మ లు కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో సాయంత్రం రథోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిర్ల సుధాకర్ సుజాత దంపతులు ఈ కళ్యాణోత్సవం లో పాల్గొన్న భక్త కోటికి అన్నప్రసాదం వితరణ చేశారు.

# ధాన్యానికి మద్దతు ధర పొందాలి

- కొనుగోలు కేంద్రాల్లోనే
- ధాన్యం విక్రయించాలి
- కేంద్రాల తనిఖీలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల, అంకుసాపూర్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సోమవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తంగళ్లపల్లిలోని సప్తగిరి ఇండస్ట్రీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు ఈసారి ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించా లని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, గ్రేడ్ బీ రకానికి రూ.2183 నిర్ణయించిదని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని తెలి పారు. జిల్లాలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని ఎత్తోండ, వల్లభాపూర్ గ్రామపంచాయతీలో వాటర్ ట్యాంక్ ల వద్దకు వెళ్లి వాటర్ ట్యాంక్ వద్ద చుట్టు పక్కల పరిసరాలను పరిశీలిస్తూ నీటి సమస్యపై గ్రామ పంచాయతీ సిబ్బందికి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం ఉన్నందున గ్రామాలలోని నీటి కొరత లేకుండా తగు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలోని నీటి సరఫరా ప్రతిరోజు సక్రమంగా జరుగుతుందా లేదా అని వివరాలను గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని నీటి ఎద్దడిని లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఈవో ఉమాకాంత్, ఎల్పీఓ సాయిబాబా ఆదేశించారు. నీటి ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉంచలన్నారు. క్లోరినేషన్ చేస్తూ పైప్ లైన్లు లీకేజీలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కేఆర్.మనోహర్ రెడ్డి, ఆర్ డబ్ల్యు ఏఈ. ధనరాజ్ పంచాయతీ ఈవో ఉమాకాంత్ సిబ్బంది ఉన్నారు.

## ఎదురులేని విజేత బ్రాహ్మానందచారి

- సూర్యుడి గుర్తుతో విజయ డంకా
- మైసమ్మ నగర్ ఏ సంక్షేమ సంఘం
- ఎన్నికల్లో అధ్యక్షుడిగా మెజార్టీతో గెలుపు

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తే ప్రజా ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయని నిస్వార్థంగా సేవ చేస్తే ప్రజా అభిమానం చూరగొనవచ్చునని నిరూపించాడు మైసమ్మ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్వాల బ్రహ్మానంద చారి.గత ముప్పై అయిదు సంవత్సరాలుగా బస్తితో వున్న అనుబంధంతో ఆ ప్రాంతంపై వున్న మమకారంతో అనునిత్యం బస్తీ అభివృద్ధికై పరితపించాడు.చిన్నా పెద్ద అందరిని ప్రేమతో పలకరిస్తూ బస్తీవాసులకు పెద్ద దిక్కుగా నిలిచాడు. అందుకే వారికి ఎల్లవేళలా చేదోడువాదోడుగా వుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బ్రహ్మందచారిని ఈ నెల 14 న జరిగిన బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధ్యక్షుడిగా గెలిపించుకున్నారు.

**ఎదురులేని విజేత:**

పోరాడే చేతికి కత్తి ఇవ్వాలి-మాట్లాడే నోటికే మైకివ్వాలి- ఊరిని ఉద్దరించే వారికే ఓటేయ్యాలి ఇదీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో బ్రాహ్మనంద చారి ప్యానల్ నినాదం. గంతంలో బస్తీ అభివృద్ధి కోసం వారు పనిచేసిన ప్రజా విశ్వాసం తో మొత్తం 346 ఓట్లు పోలవ్వగా అధ్యక్షుడిగా బ్రాహ్మనంద చారికి 263 ఓట్లు రాగా ప్రధాన కార్యదర్శిగా ధార ముకేశ్ 346 ఓట్లకుగాను 264 ఓట్లతో గెలుపొందారు.గతంలో బస్తీ అభివృద్ధికై బ్రహ్మనంద చారి ప్యానల్ చేసిన పనితీరుకు మెచ్చిన స్థానిక ప్రజలు 35 ఏళ్ల బస్తీ చరిత్ర లో జరిగిన మొదటి ఎన్నికల్లో బ్రహ్మనంద చారి ప్యానల్ సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించుకున్నారు.





## కాంగ్రెస్ పార్టీ గామ కమిటీ ఎన్నిక

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండల కేంద్రంలో షాదిఖాన కార్యాలయంలో ఆదివారం బాన్సువాడ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బూతు స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.





అనంతరం పోతంగల్ నూతన గ్రామ కమిటీని ఎంపిక చేసి అధ్యక్షులుగా పుల్కంటి సాయిలు, ఉపాధ్యక్షులుగా గజ్జల శివ, ఎన్. రాజు, ఏస్థాని దేశాయ్, సోనాయి శ్రీనివాస్, గౌరు హన్మాండ్లు, జనరల్ సెక్రెటరీగా ఖాలీక్ ను ఏకిగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు పుప్పాల శంకర్ తెలిపారు. బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ను కార్యకర్తలందరూ కలసి కట్టుగా ఎన్నికల్లో పనిచేసి భారీ మెజార్టీని ఇవ్వాలని పొతంగల్ మండల కార్యకర్తలకు , గ్రామాల బూత్ స్థాయి కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు పుప్పాల శంకర్, ఎంపీటీసీ కేశ వీరేశం మాజీ వైస్ ఎంపిపి గంధపు పవన్, ఎలమంచిలి శ్రీనివాస రావు, బజరంగ్ దత్తు, దన్‌రాజ్, మన్సూర్, రాజు, మాజీ ఎంపీటీసీ హనుమంతరావు పటేల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు సన్మానం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** మండల కేంద్రానికి చెందిన రక్తదాత, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ గిరిధర్ రెడ్డి 48 సార్లు రక్తదానం చేసి రికార్డు సాధించారు. 'తెలుగు వెలుగు' సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని త్యాగరాయ గానసభలో మహానంది పురస్కారాన్ని గిరిధర్ రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వంగ గిరిధర్ రెడ్డి కి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, పట్టణ అధ్యక్షులు చెన్నిబాబు, నాయకులు పాల్గొన్నారు.

## దేవయ్య కుటుంబాన్ని పరామర్శ

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భీమరి దేవయ్య కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తన ఇంటి కి వెళ్లి పరామర్శించారు. ఆదివారం ఉదయం దేవయ్య తాటిచెట్టు ఎక్కి తాటి ముంజలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ జారీ కింద పడిపోయాడు. ఈ సంఘటనలో దేవయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి , పార్టీ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

## మధుయాష్కీకి పరామర్శ

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కీ గౌడ్ తల్లి శ్రీమతి అనసూయ అనారోగ్యంతో వయసు సంబంధిత రుగ్మతలతో బాధపడుతూ సోమవారం హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు మధుయాష్కి గృహానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి ఘన నివాళులర్పించారు. మధుయాష్కిని పరామర్శించారు.

## బెల్ట్ షాపులల్లో మద్యం సీజ్

**తెలంగాణ ప్రభ (వర్ని) :** వర్ని మండలంలోని శ్యామ్‌రావు తండాలో ఒక కిరాణా షాప్‌లో అక్రమంగా నిలువ ఉంచిన 4.350 లీటర్ల మద్యాన్ని పోలీసలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ మద్యం విలువ రూ.4785 ఉన్నట్లు తెలిపారు.

## బీజేపీ, బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఆశీర్వదించినట్టే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో అమలు చేస్తామన్నా ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిల్ల లింగం గౌడ్, వంగ గిరిధర్ రెడ్డి , కొత్తపల్లి దేవయ్య , గుండాడి రామ్ రెడ్డి, గుగ్రపు రాములు, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, మద్దుల శ్రీపాల్‌రెడ్డి, మాలోత్ రామచంద్రం నాయక్, పొన్నాల మల్లారెడ్డి, కంకనాల శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## బండి సంజయ్‌ని గెలిపించాలి

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వాడవాడలా బిజెపి ప్రచారం విస్తృతంగా చేస్తూ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కి ఓటు వేసి మూడోసారి నరేంద్ర మోడీని ప్ర ధానమంత్రి చేయాలని ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.



## వినోద్‌కుమార్‌కు భారీ మెజార్టీతో ఇద్దాం


**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** మండల కేంద్రంలోని జెడ్పిటిసి కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయిన్పల్లి వినోద్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పిటిసి చీటీ లక్ష్మణ రావు, బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విలేకరుల సమావేశంలో కోరారు. పది సంవత్సరాలు కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. కలిసికట్టుగా ఎన్నికలలో ప్రచారం నిర్వహించి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, శ్రీనివాస్, అప్సర ఉన్నిసా, కృష్ణ, హరి, పాల్గొన్నారు.



## రేణుకఎల్లమ్మ ఆలయంలో చోరీ

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** మండలంలోని అల్మాస్పూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ గుడిలో, హోటల్ లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరి కి పాల్పడ్డారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ తాళాలను గుర్తు తెలియని దొంగలు పగులగొట్టి హుండి తాళాలు పగులగొట్టి దొంగిలించుకపోయారు. అనంతరం పక్కనే ఉన్న కందునూరి సంతోష్ హోటల్ షటర్ తాళాలు పగులగొట్టి కౌంటర్ నుంచి రూ.20 వేల నగదు, రూ.10 వేల విలువైన సిగరేట్ ప్యాకెట్లు , కూల్ డ్రిక్స్ ఎత్తుకెళ్లారు. హోటల్ యజమాని సంతోష్ ఫిర్యాదు మేరకు పోటీలసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




# బాలల హక్కులపై అవగాహన ఉండాలి

**బాలలకు సైతం పెద్దవారికి మాదిరిగా హక్కులున్నాయని తెలుసా? హక్కులు, బాధ్యతలు అనేవి చిన్నా, పెద్దా అని వయసుతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తికి రాజ్యాంగం కొన్నిటిని కల్పించింది. వాటిని అతిక్రమించే హక్కు ఎవరికీ లేదు. బాలల రక్షణకు సంబంధించి కొన్ని చట్టాలు కుండా ఉన్నాయి. వారి హక్కుల్ని పరిరక్షించడానికి చట్టాలను ఏర్పాటు చేశారు. చట్టాలను అతిక్రమించి న వారికి శిక్షలు తప్పవు. కానీ సాధారణ సమాజంలో బాలల చట్టల గురించి ఎవరికీ అవగాహన లేదు. తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు ఈ హక్కులు, చట్టాల గురించి అవగాహన కలగజేస్తే బాగుంటుంది.**




మనం తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులకే అత్యంత ఉన్నత స్థానాన్ని ఇచ్చాము. ఈనాడు ఏ ఉపాధ్యాయుడికీ పిల్లల సమస్యల గురించి పట్టదు. కనీసం పసివాడు ఎంత చదవగలడు ? ఎంత రాయగలడు? అన్న వివేచన కూడా ఉండదు. పిల్లవాడు అల్లరి చేయుకుండా చూడటమే వారి పని. అదుకే పిల్లలు కదలకుండా, మాట్లాడకుండా కాపలా కాస్తుంటారు. శృతిమించిన క్రమశిక్షణ పిల్లల్లోని సృజనాత్మకతను, సహజ సిద్ధతనూ కోల్పోయేలా చేస్తుంది. ఉత్సాహం, చలనం లోపించిన బాలలు ప్రాణంలేని బొమ్మలతో సమానం. పిల్లల్లోని సహజత్వానికి భంగం కలగకుండా పాఠాలు బోధించాలి సున్నితత్వాన్ని అమాయకత్వాన్ని కోల్పోయిన పిల్లల్ని బాలలు అనలేము. ఏ వయసు పిల్లలకు ఎంత హోంవర్కు అవసరమో అంతే ఇవ్వాలి. వారి ఆటపాటల సమయాన్ని హరించేసే హోంవర్కులు పిల్లల ప్రగతికి గొడ్డలి వేట్లు.

తల్లి దండ్రులు సైతం పిల్లల పెంపకాన్ని భారంగానే చూస్తున్నారు. తమ్మ చదువులు, ఉద్యోగాలు, కెరీర్ పైనే శ్రద్ధ పెడుతూ పిల్లల్ని అనవసర భారంగా భావిస్తున్నారు. లక్షల ఫీజులైనా కట్టేసి పెద్ద పెద్ద సూళ్ళలో చేర్పించేసి చేతులు దులుపు కుంటున్నారు హాస్టళ్ళలో వారి అవస్థలు చెప్పనలవి గాదు. కొంత మంది గడుసు పిల్లలకు సమస్యలేం రాకపోవచ్చు. కొంత మంది సున్నిత మనస్కులుగా ఉంటారు. అటువంటి పిల్లలు తమ సమస్యలను అందరికీ చెప్పుకోలేరు ఇటువంటి పిల్లలు కొన్నిసార్లు తల్లి దండ్రుల వద్ద కూడా నోరు విప్పి చెప్పరు. పెద్ద క్లాసు పిల్లలు, రౌడీ పిల్లలు తమ హోంవర్కుల్నీ, మిగతా పనుల్నీ నెమ్మదస్తులమేత చేయిస్తుంటారు. ఇవి టీచర్ల దాకా వెళ్ళవు. ఒక వేళ వెళ్ళినా గడుసు పిల్లల్నే తెవివగల పిల్లలుగా టీచర్లు మెచ్చుకుంటుంటారు నిదానస్తులకు, నిజాయితీ పరులకు ఎక్కువ పేరు ప్రతిష్టలు రావు.

ప్రపంచ వ్యాప్తంగా బాలల హక్కుల దినోత్సవం జరుపుకుంటారని తెలుసా? బాలల హక్కుల గురించి ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించటం కోసం ఈ దినోత్సవాన్ని ప్రతి ఏటా నవంబరు 20వ తేదీన జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి 1954వ సంవత్సరంలో డిశంబరు 14వ తేదిన ఒక తీర్మానం చేసింది. ప్రతి సంవత్సరం ప్రపంచ బాలల దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. 1959 వ సంవత్సరం నవంబరు 20వ తేదీని ప్రపంచ బాలల హక్కుల దినోత్సవంగా నిర్వహించడానికి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించింది. బాలల సంక్షేమం, బాలల హక్కులు కాపాడబడటం కోసం విద్యా సంస్థల అధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తారు. ఇంకా స్వచ్ఛంద సంస్థల నుంచి అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తారు.

**బాలల సంరక్షణ దేశానికి చాలా ముఖ్యం బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత. సమాజంలో ప్రతి ఒక్కరు ఈ హక్కుల పరిరక్షణ కోసం పాటుపడాలి. విద్య అనేది ప్రతి భారతీయ పౌరుడి యొక్క ప్రాథమిక హక్కు. విద్య ప్రతి ఒక్కరికీ మౌలికస్థాయిలో ఉచితంగా లభించాలి. నిర్బంధంగానైనా బాలలందరికీ విద్యా హక్కు అమలు కావాలి అప్పుడే నవ భారతం లో కాబోయే నూతన పౌరలు దేశాన్ని రక్షించుకోగలగుతారు.**

బాలలు అత్యధికంగా హింసకు గురి అవుతున్నారని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. స్త్రీ శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో బాలల గురించి సర్వేలు చేయబడ్డాలు. ఐదు నుంచి పన్నెండు సంవత్సరాల బాలలు ఎక్కువగా హింసతో పాటు అత్యాచారాలు కూడా జరుగుతున్నట్లుగా సర్వేలు చెబుతున్నాయి. భౌతిక మరియు లైంగిక, మానసిక దాడులకు పిల్లలు బలవుతున్నారు. బాల కార్మికుల సమస్య కొంతవరకూ తగ్గినప్పటికీ పూర్తిగా మాసిపోలేదు. బాల కార్మికులు ఇంతకు పూర్వం ఇటుక బట్టీలలో, కొండల తవ్వకాలలో, గ్రానైట్ క్వారీరులలో పనిచేసేవారు. ప్రమాద పరిస్థితుల్లో పనిజెసే బాలల్ని బాలకార్మికులు అనేవారు. ఇప్పుడు బాలకార్మిక వ్యవస్థ రూపం మార్చుకుని స్కూళ్ళలో చేరింది. బస్తాల బస్తాల పుస్తకాలు మోయటం, రాత్రనక పగలనక రాసినవే రాయటం, స్లిప్ టెస్ట్ లు , వీక్లీ టెస్ట్ లు, మంత్లీ టెస్ట్ లు అంటూ రకరకాల టెస్ట్ లతో పిల్లలను మనశ్శాంతికి దూరం చేయడం వంటివన్నీ నేటి స్కూళ్ళలో నిత్య కృత్యమై పోయాయి. పెద్ద పేరున్న స్కూళ్ళ వత్తిడి తట్టుకోలేక ఎంతో మంది బాలలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీనికి తల్లి దండ్రులు నిర్లక్యధోరణి, పట్టించుకోకపోవడం కూడా కారణమవుతున్నాయి.

బాలల సంక్షేమం కొరకు పార్లమెంటు కొన్ని చట్టాలు చేసింది. జువైనల్ జస్టిస్ చట్టం, బాల కార్మికుల నిషేధ చట్టం, న్యానసేవల చట్టం, నిర్భంద ప్రాథమిక విద్య హక్కు, బాలల అక్రమ రవాణా నిషేధ చట్టం, శిశు నిర్ధారణ పరిక్షల నిషేధ చట్టం, శిశు పౌష్టికాహార ఉత్పత్తి, సప్లై చట్టం వంటి ఎన్నో చట్టాలను చేసింది. ఆర్టికల్ 15 ద్వారా పిల్లల సంక్షేమానికి ప్రత్యేకమైన నిభందనలు రూపొందించవచ్చు సమానత్వ హక్కు ఆర్టికల్ 14 ద్వారా, వివక్షకు వ్యతిరేకంగా హక్కు ఆర్టికల్ 15 ద్వారా వ్యక్తిగత స్వేచ్ఛ మరియు న్యాయ ప్రక్రియ హక్కు ఆర్టికల్ 21 ద్వరా అక్రమ రవాణా నుంచి రక్షించబడే హక్కు ఆర్టికల్ 23 ద్వారా బాలలకు హక్కులు ఏర్పరచ బడ్డాయి. ఈ విధంగా పిల్లలకు కూడా పెద్ద వారితో సమానంగా పన్నెండు బాలల హక్కులు ఇవ్వబడ్డాయి. పిల్లల హక్కుల పరిరక్షణకు తల్లిదండ్రులు లేదా సంరక్షకాలు బాధ్యత వహించాలి. నేడు ప్రపంచ వ్యాప్తంగా బాలల హక్కుల పట్ల పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. కాని ఆచరణలో సాధ్యం కావటం లేదు. బాలల హక్కుల గురించి భారత రాజ్యాంగంలో ఎన్నో అంశాలు పొందుపరి ఉన్నాయి.



వ్యాసకర్త
డాక్టర్ కందేపి రాణీప్రసాద్
రచయిత, సామాజిక సేవకురాలు